భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి వేడుకలు

- సాయిబాబా మందిరాలకు పోటెత్తిన భక్త జన సందోహం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నసంతర్పణలు

సత్తెనపల్లి: గురు పౌర్ణమి పురస్కరించుకొని పట్టణంలోని సాయిబాబా ఆలయాల్లో ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాహం భజన, భక్తి గీతాలు ఆలపించారు. సాయిబాబా మందిరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ సమీపంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబాకు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, పల్లకి సేవ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై సాయిబాబా కృపకు పాత్రులయ్యారు. భక్తులకు అన్న సమారాధనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల వద్ద గల సాయిబాబా మందిరానికి భక్తులు కనీవినీ ఎరుగని రీతిలో పోటెత్తారు. దీంతో పోలీసులు ఆ ప్రాంతంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షించారు.

సత్తెనపల్లి మండలంలో...

మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు సాయిబాబా ఆలయాల్లో గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందిగామ గ్రామంలోని సాయిబాబా మందిరంలో సాయినాథుని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కీర్తిశేషులు ఆళ్ల కోటేశ్వరరావు జ్ఞాపకార్థం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముప్పాళ్లలో...

ముప్పాళ్ల: మండలంలోని పలు గ్రామాల్లో గురు పౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. చాగంటివారిపాలెం, మాదల గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు బాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం బాబా వారి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

గురు పౌర్ణమి విశేష పూజలు

నకరికల్లు: గురు పౌర్ణమి పురస్కరించుకొని మండలంలోని పలు ఆలయాల్లో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. చల్లగుండ్ల గ్రామంలోని సున్నపుబట్టి వద్ద గల సాయిబాబా ఆలయంలో, నర్సింగపాడు గ్రామంలోని అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో, పలు గ్రామాల్లోని ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వార్లకు విశేష ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. స్వామి వార్లను, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సున్నపుబట్టి వద్ద గల సాయిబాబా ఆలయంలో ఆషాఢ పౌర్ణమి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయం వద్ద పొంగళ్లు పొంగించారు. ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామి వార్లకు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయ మండపంలో మహిళా భక్తులు వివిధ రంగులతో తీర్చిదిద్దిన శివలింగాకారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భజన బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన భజన కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి వారి కీర్తనలు ఆలపించారు. భక్త సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన మహా అన్నదాన కార్యక్రమంలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

సాయినాథునికి అన్నాభిషేకం

అమరావతి: పవిత్ర పుణ్యక్షేత్రమైన అమరావతి శ్రీ షిర్డీసాయి–పర్తిసాయి కపోతేశ్వర ధ్యాన మందిరంలో గురు పూర్ణిమ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవ, నగర సంకీర్తన, హారతి కార్యక్రమాలను నిర్వహించారు. తర్వాత బాబా విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకారం చేసి విశేష పూజలు చేశారు. అనంతరం దత్తాత్రేయ, షిర్డీ సాయిబాబా, సత్య సాయిబాబా చిత్రపటాలకు, పాదుకలకు భక్తులు పూజలు చేశారు. అనంతరం షిర్డీ సాయినాథుని విగ్రహానికి అన్నాభిషేకం నిర్వహించారు. సాయంత్రం సంకీర్తన, ఉయ్యాల సేవ హారతి, దత్త పారాయణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెదకూరపాడులో...

పెదకూరపాడు: మండలంలోని పెదకూరపాడు, 75త్యాళ్ళూరు, రామాపురం, అబ్బరాజుపాలెం, లగడపాడు గ్రామాల్లో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు సాయిబాబా ఆలయాలకు పోటెత్తారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదానం చేశారు.

రాజుపాలెంలో...


రాజుపాలెం: మండలంలోని గణపవరంలో సాయిబాబా ఆలయానికి గురు పౌర్ణమి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం స్వామి వారిని వివిధ రకాల పూలతో విశేషంగా అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

క్రోసూరులో...

క్రోసూరు: క్రోసూరులోని సాయిబాబా మందిరంలో ఆదివారం గురు పూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. భక్తులు అశేషంగా పాల్గొన్నారు. 10 రకాల ప్రసాదాలను ఆలయ కమిటీ భక్తులకు అందజేసింది. గురు పూర్ణిమ పురస్కరించుకుని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పర్యవేక్షించారు.

అచ్చంపేటలో...

అచ్చంపేట: గురు పౌర్ణమి సందర్భంగా స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారిని విశేషంగా అలంకరించారు. షిర్డీ సాయి, పర్తిసాయి, దత్తాత్రేయ, విఘ్నేశ్వర విగ్రహాలకు మహా కుంభాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిభక్త సమాజం వారు భజన కార్యక్రమాలు చేపట్టారు. ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో స్వామి వారికి సాయి నామ సంకీర్తన పారాయణ చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


చాగంటివారిపాలెం గ్రామంలోని సాయిబాబా మందిరంలో...


శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల వద్ద సాయిబాబా మందిరంలో...


నందిగామలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా


విశేషాలంకారంలో సాయినాథుడు


పెదకూరపాడులోని సాయిబాబా దేవాలయంలో...


సాయిబాబా మందిరం వద్ద పోటెత్తిన భక్తులు


నందిగామలో అన్నసంతర్పణలో భక్తులు


నర్సింగపాడులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవి


క్రోసూరులోని సాయిబాబా మందిరంలో...


గణపవరంలో విశేష అలంకారంలో సాయిబాబా


పట్టణంలోని సాయిబాబా మందిరంలో క్యూలైన్‌లో భక్తులు


సాయిబాబా ఆలయంలో మహిళలు రంగులతో తీర్చిదిద్దిన శివలింగాకారం

క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

మాల మహానాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాతంగి సుధాకర్



పెదకూరపాడు: రాష్ట్రంలో దళితులపై హత్యలు, అత్యాచారాలు ఒక పక్క జరుగుతుంటే మరో పక్క దేశానికి రాజ్యాంగం రాసిన మహానుభావుడు డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాలపై కూడా దాడులు జరగడం బాధాకరమని మాల మహానాడు పెదకూరపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాతంగి సుధాకర్ అన్నారు. ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కృష్ణా జిల్లా పెడన మండలంలో దళితులు ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేయడం సరికాదన్నారు. శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని దళితులపై దాడులతో పాటు అంబేడ్కర్ విగ్రహాలు ధ్వంసం చేస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. దాడులు చేసిన వారిని గుర్తించి వెంటనే కఠినంగా శిక్షించాలన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎం ప్రసాదరావుకు సన్మానం



సత్తెనపల్లి: గురు పౌర్ణమి పురస్కరించుకొని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ఉన్నవ పూర్ణచంద్ర ప్రసాదరావును శ్రీ సరస్వతి శిశుమందిర్ కమిటీ సభ్యులు ఆదివారం పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. పట్టణంలోని వావిలాల వారి వీధిలో గల శ్రీ సరస్వతీ శిశు మందిర్ ప్రాథమిక పాఠశాలలో కమిటీ సమావేశం అనంతరం సన్మానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల సమితి కార్యదర్శి ఎంఎస్‌వీ నాగరాజు, బాధ్యులు గణపవరపు రంగారావు, పెండ్యాల హరేరామ్, డి.సాంబశివరావు, వాసు, సమితి కోశాధికారి దేవతి సాంబశివరావు, ఆచార్యులు, మాతాజీలు తదితరులు ఉన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



రాజుపాలెం: మండలంలోని కొండమోడు పరిధి వీరమ్మ కాలనీలో గల దీనమ్మ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ పిల్లల, వృద్ధుల ఆశ్రమంలో ప్రతిభ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ చైర్మన్ పాశం శ్రీనివాస రెడ్డి గురు పౌర్ణమి సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి పాశం మహిపాల్‌రెడ్డి, సభ్యులు చెవుల స్వామి, దీనమ్మ సొసైటీ చైర్మన్ గరికపాటి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సన్మార్గంలో నడిపించే గురువులను పూజించాలి



అమరావతి: సమాజాన్ని సన్మార్గంలో నడిపించి అందరికి మార్గదర్శకంగా నిలిచే గురువులను పూజించాలని భవఘ్ని గురూజీ అన్నారు. మండల పరిధిలోని వైకుంఠపురంలో ఆదివారం గురు పౌర్ణమి సందర్భంగా వ్యాస భగవానుని పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భవఘ్ని గురూజీ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేనటువంటి ఆధ్యాత్మిక జ్ఞాన సంపద మన దేశానికి రుషులు, మునులు, గురువులు అందించారన్నారు. మహోన్నతమైన జ్ఞాన సంపదను సామాన్యునికి సైతం అర్థమయ్యే రీతిలో బోధించే గురువులను స్మరించుకోవటం అదృష్టంగా భావించాలన్నారు. వ్యాసభగవానుడు బోధించిన ధర్మాలను త్రికరణ శుద్ధిగా పాటిస్తే సమాజం సుఖ సంతోషాలతో విలసిల్లుతుందన్నారు. ఈ సందర్భంగా ఆదిగురువు వ్యాసభగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భగవాన్ వేదవ్యాస సనాతన ధర్మక్షేత్రం గురించి భవఘ్ని గురుదేవులు రచించిన మహావాక్య వివరణ పుస్తకాన్ని ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ వేడుకలలో పాల్గొన్న భక్తులందరికీ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


వేదవ్యాస సనాతన ధర్మక్షేత్రం మహావాక్య వివరణ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కన్నా రంగయ్య ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకం

రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

సత్తెనపల్లి: విద్యాభివృద్ధికి కన్నా రంగయ్య ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని రఘురామ్‌నగర్‌లోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం కీర్తిశేషులు కన్నా రంగయ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్ అధినేత, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రతిభా వంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తన తండ్రి కీర్తిశేషులు కన్నా రంగయ్య పేరుతో రేపటి తరం విద్యార్థులకు ఓ మంచి భవిష్యత్తు, విజ్ఞానం ఉండాలనే ఆలోచనతో 2013లో కన్నా లక్ష్మీనారాయణ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా మొత్తం ఇవ్వాలని కన్నా లక్ష్మీనారాయణ కోరికని చెప్పటం ఆయన అభ్యుదయ వాదానికి ప్రతీక అన్నారు. రాజకీయాల్లో ఎప్పుడు కలుస్తామో .. ఎప్పుడు విడిపోతామో తెలియదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన అనేక మంది శాస్త్రవేత్తలుగా ఎదిగి సేవలందిస్తున్నారన్నారు. నేను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివే ఈ స్థాయికి చేరుకున్నానని, కార్పొరేట్ పాఠశాలల్లో చదివిస్తేనే పిల్లలకు చదువు వస్తుందని తల్లిదండ్రులు భావించడం సరికాదన్నారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 2013 నుంచి కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతిభా వంతులైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఆసుపత్రులకు అవసరమైన మౌలిక వసతులు, నిరుపేదల అభ్యున్నతికి ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నానన్నారు. గతంలో గుంటూరు నుంచి నిర్వహించే కార్యక్రమాల్ని గడచిన ఏడాది నుంచి సత్తెనపల్లిలో నిర్వహిస్తున్నానని, మీ అందరి సహకారంతో సేవ చేయగలుగుతున్నానన్నారు. రాబోయే రోజుల్లో చారిటబుల్ ట్రస్ట్ సేవల్ని విస్తృతం చేస్తానన్నారు. ముందుగా కన్నా రంగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న మంత్రి ఆనం పక్కన ఎమ్మెల్యేలు కన్నా, చదలవాడ

● విద్యుత్ స్తంభాలకూ టీడీపీ రంగులు..!



గారపాడు గ్రామ రహదారులకు ఇరువైపుల టీడీపీ రంగులతో ఇలా...



గత ప్రభుత్వ హయంలో ప్రభుత్వ భవనాలకు వైఎస్సార్‌సీపీ రంగులు వేశారని ఎంతో హడావుడి చేసి నానా యాగి చేసిన టీడీపీ నేతలు అధికారంలోకి వచ్చిన వెంటనే చెప్పిన నీతులను మరిచారు. ఏకంగా రహదారి వెంబడి ఉన్న విద్యుత్ స్తంభాలనూ వదలకుండా నేతల పేర్లతో పసురంగులు వేశారు. పెదకూరపాడు మండలం గారపాడు గ్రామంలోని రహదారి వెంబడి విద్యుత్ స్తంభాలకు టీడీపీ రంగులు వేశారు. ఇదే తరహాలో పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు పచ్చ రంగు వేయడానికి సిద్ధమయ్యారు. వీటిని చూసి స్థానికులు అవాక్కవుతున్నారు.

–పెదకూరపాడు

కృత్రిమ జైపూర్ కాళ్లు పంపిణీ

పిడుగురాళ్ల: రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ, రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం, ఎస్ఆర్ ఐవీఏ టీమ్ సహకారంతో పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం దివ్యాంగులకు కృత్రిమ జైపూర్ కాళ్లను ఉచితంగా అందించారు. కొద్ది రోజుల క్రితం కొంత మంది దివ్యాంగులను గుర్తించి, కొలతలు తీసుకొని, ప్రత్యేకంగా తయారు చేసిన జైపూర్ కాళ్లను సుమారు 100 మందికి అందించినట్లు రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్‌సిటీ అధ్యక్షుడు గుండాల అశోక్‌బాబు తెలిపారు. కృత్రిమ జైపూర్ కాళ్లకు అయ్యే ఖర్చును రోటరీ క్లబ్ సభ్యులు నూతి నారాయణ అందించినట్లు తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం ప్రాజెక్టు కన్వీనర్ పసుమర్తి రంగారావు, కార్యదర్శి పి.సాంబశివరావు, బి.సుధాకర్‌రావు, దళపతి, గోపి, కె.శ్రీనివాసరావు, నీరుమళ్ల రాజేష్ పాల్గొన్నారు.

ఆర్‌సీఎం చర్చి పాస్టర్ జన్మదిన వేడుకలు

మాచర్ల: నాలుగు దశాబ్దాల పాటు నిత్య సహాయ మాత, కానుకమాత, ఏసు ప్రభువు సేవలో పునీతుడవ్వడం తన అదృష్టమని పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి పాస్టర్ కొమ్మారెడ్డి రఫేల్‌రెడ్డి అన్నారు. తన 60వ జన్మదినాన్ని పురస్కరించుకొని కేపీపీకి వెళ్లే రహదారిలో ఉన్న నిత్య సహాయ మాత చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పల్నాడులో ఆర్‌సీఎం సంస్థల ఆధ్వర్యంలో విద్యాభివృద్ధి, ప్రభువు, మాతల ఆరాధన కార్యక్రమాలు నిర్వహించటం జరిగిందన్నారు. చర్చి పెద్దలు జక్కిరెడ్డి మర్రెడ్డి, కిరీటిరెడ్డి, సుందరరాజ్, ప్రకాష్, సిస్టర్‌లు తోమాస్, ఇన్నమ్మ, మాసమ్మ, ఫాదర్ సోదరుడు తుమ్మారెడ్డి, తమ్మమ్మరెడ్డి భక్తులు పాల్గొన్నారు.

శాకంబరీ మాతగా చౌడేశ్వరి



రెంటచింతల: స్థానిక బాలవికాస్ స్కూల్, తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ఆలయాల్లో కొలువైన చౌడేశ్వరి అమ్మవారు ఆదివారం శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా దేవస్థానాల ప్రధాన అర్చకులు పి.అనిల్‌కుమార్ శర్మ, ఓరుగంటి మారుతిశర్మ నేతృత్వంలో పూలు, పండ్లు, పలు రకాల కూరగాయలు, వివిధ రకాల ఆకులతో అమ్మవారిని అలంకరించి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. పెద్దశెట్టి పల్లా వెంకటేశ్వర్లు, శీలం నారాయణ, ఆయా కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో గరుడ వాహన సేవ



సత్తెనపల్లి: ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్‌లో గల అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు, కలియుగ దైవం అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో శ్రీవారి గరుడ వాహన సేవ నిర్వహించారు. శ్రీవారికి స్నపన తిరుమంజన సేవ, గోత్రనామాలతో అభిషేకాలు ఆలయ అర్చకులు శ్రీమాన్ చిత్రకవి శ్యాము ఆచార్యులు రామానుజ స్వామి నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై గరుడ వాహన సేవలో పాల్గొని గరుడ ముద్దతో పాటు శ్రీవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చల్లంగా చూడమ్మా... శాకంబరీ


రామాపురంలో శాకంబరీ దేవిగా నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారు


రామాపురంలో అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

- పలు చోట్ల శాకంబరీగా దర్శనమిచ్చిన అమ్మవార్లు
- రామాపురంలో అమ్మవారికి బోనాలు
- పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు

పెదకూరపాడు: పాడి పంటలతో... సుఖ సంతోషాలతో... మంచి ఆరోగ్యంతో ఉండేలా చల్లంగా చూడమ్మా... శాకంబరీ దేవి అంటూ మండలంలోని రామాపురం గ్రామంలో ఆషాఢ మాసం ఆదివారం పురస్కరించుకుని వందలాది మంది మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాలు సమర్పించారు. తెల్లవారు జాము నుంచే సామూహికంగా అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు.

సత్తెనపల్లిలో...

సత్తెనపల్లి: దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రైతు లోగిళ్లు పాడిపంటలతో కళకళలాడుతూ ఉండాలని ఆషాఢ పౌర్ణమి పురస్కరించుకొని పట్టణంలోని పలు ఆలయాల్లో ఆదివారం అమ్మవార్లను శాకంబరీగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పట్టణంలోని త్రిశక్తి దుర్గాపీఠంలో దుర్గమ్మని శాకంబరీగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా దుర్గా పీఠం పీఠాధిపతి వెలిదండ్ల హనుమత్ స్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పట్టణంలోని వెంకటపతి కాలనీలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీ ప్రత్యంగిరా అమ్మవారి పీఠంలో ఆదివారం శాకంబరీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నీలంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరీగా అలంకరించారు. అనంతరం మహిళలు భారీగా పాల్గొని వివిధ వేషధారణలతో ఊరేగింపుగా అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమాన్ని శక్తి పీఠాధీస్వరి మాతాజీ శ్యామలమ్మ పర్యవేక్షించారు.


త్రిశక్తి దుర్గా పీఠంలో శాకంబరీ అలంకరణలో దుర్గమ్మ


వెంకటపతికాలనీలో శాకంబరీ అలంకరణలో నీలంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారు